ప్రజా సాహితి మాసపత్రిక (మార్చి, 1978)

# ప్రజల మనిషి

పరంధామయ్యగార్కి,

ముప్పయ్యేళ్ళ క్రితం – "స్వాతంత్ర్యం" రాకముందు – 'అయ్యా! నాకో చిన్న ఉద్యోగం ఇప్పించండి' అంటూ దరఖాస్తు పెట్టుకొన్నప్పుడు తప్ప – మీకు మరో ఉత్తరము వ్రాసుకోవాల్సిన అవసరం ఇన్నేళ్ళలో ఎప్పుడూ రాలేదు!

అప్పుడేదో చిన్న ఉద్యోగం దొరికితే చాలు – ఈ జానెడు పొట్ట గడిచిపోతుందనుకున్నాను. కాని, నేనాశించిన దానికంటే, పెద్ద ఉద్యోగమే ఇస్తానన్నారు మీరు. మీ పత్రికకు విలేఖరిగా పనిచేయమన్నారు. 'నాకు రాజకీయాలవీ తెలియవంటే, ప్రతివాడు పుట్టుకతోనే నేర్చుకున్నాడా! నీవు రాజకీయ వాదివికావు. విలేఖరివి. విన్నదీ, కన్నదీ తు.చ. తప్పకుండా వ్రాయి. అది చాలు మాకు!" అన్నారు మీరు. సరేననక తప్పలేదు నాకు.

ఆనాటి మహానాయకులసమావేశాలు, సభలు, ఇంటర్వ్యూలు, ఉత్సవాలు, ఊరేగింపులు – వీటిమీద నా రిపోర్టులు ఎంత పకడ్బందీగా ఉండేవో, సత్యాగ్రహాలు, నిరాహార దీక్షలు, అరస్టులు, తీర్పులు, శిక్షలు, వీటన్నిటితో నిండిన స్వాతంత్ర్య సమాచారాలన్నీ ఎంత పటిష్టంగా ఉండేవో మీరు గ్రహించారు.

"ఏం తెలియదన్నావానాడు – నీ రిపోర్టుల మూలంగా మన పత్రిక్కి, చాలా పేరొచ్చింది" అని మీరొకనాడు పిల్చి పొగిడేసరికి నేను నిజంగా ఉబ్బి తబ్బిబ్బయి పోయాను. ఎప్పటికీ మీ పత్రికని వదలకూడదని మరింత విశ్వాసంగా పనిచేయాలని ఒట్టు వేసుకున్నాను కూడా!

కాని,

ఆ సోకాల్డ్ స్వాతంత్ర్యం(?) ఏదో వచ్చాక......

దేశంలో ఎన్నో మార్పులు(!) తెచ్చాక.....

నేను కళ్ళు కొంచెం కొంచెం తెరిచి చూస్తే వాస్తవంగా జరిగింది ఏమిటి?

ఒక్కసారి గతాన్ని సింహావలోకనం చేసుకుంటే, నేను చేసుకున్నది ఆత్మవంచన.... చేసినది విలేఖరివృత్తికి తీరని ద్రోహం....

అవును. అది ఇప్పుడు నాకు చాలా స్పష్టంగా తెలుసు.

ఉద్యోగంలో చేరినప్పుడు మీరు అన్నది - నేను విన్నది, కన్నది తు.చ. తప్పకుండా వ్రాయాలని, కాని ఈ ముప్పయ్యేళ్లలో నేను పత్రికలో వ్రాసింది నిజంగా నేను విన్నదేనా? ప్రజలకు నేను చూపించింది నిజంగా నేను చూసిందేనా?

కాదు. ముమ్మాటికీ కాదు. ఈ సంగతి మీకు తెల్సినంత బాగా మరెవ్వరికీ తెలియదు. కొన్ని సంఘటనలు గుర్తు చేస్తాను మీకు.

మహాత్మాగాంధి రోడ్డులో డ్రెయినేజీ కాంట్రాక్టు నీలకంఠంకి ఇప్పించారు - ఎమ్మెల్యే సుబ్బరాజుగారు. కొంతపని అయ్యాక, బిల్లుపెట్టి డబ్బు తీసుకున్నాడు నీలకంఠం. అయితే, అన్నమాట ప్రకారం పార్టీ చందాగా సుబ్బరాజుగార్కి డబ్బివ్వాల్సి వచ్చింది. అదే సమయంలో తన మేడమీద మరో అంతస్తు పనికూడా ప్రారంభించాడు నీలకంఠం. ఫారెన్ వెడుతున్న అల్లుడికి డబ్బివ్వాల్సి వచ్చింది. వీటిమూలంగా నీలకంఠం చేతికి వచ్చిన డబ్బు ఒక్కసారిగా ఖర్చయిపోయింది. ఆపై డ్రయినేజీ పనికేమీ మిగల్లేదు. డబ్బులేందే పనికాదు. పని అయితే కాని డబ్బివ్వమంటారు అధికార్లు. పని అయిపోయినట్టు మరో బిల్లు పెడతాను. డబ్బు ఇప్పించమంటాడు నీలకంఠం. తన వాటా తనకు యిస్తే కాని సంతకం పెట్టనంటాడు మున్సిపల్ ఇంజనీర్. బేరం దగ్గర గొడవ వచ్చింది. వాళ్ళ వాదనలు ఎన్నాళ్ళకీ తెగలేదు. ఇంతలో విపరీతంగా వర్షాలు కురిసి, డ్రెయినేజీ నిండా నీళ్ళు చేరాయి. అడ్డు కట్టిన కర్రలు నీళ్ళలో మునిగిపోయాయి. అది తెల్సినా, నీలకంఠం జాగ్రత్తలు తీసుకోలేదు. ఆ నీళ్ళ గోతిలో పడి చచ్చిపోయాడు వీరయ్యకొడుకు. వీరయ్యతోటి వాళ్ళంతా మున్సిపల్ ఆఫీసుమీద విరుచుకు పడ్డారు. ఆ ఆందోళన సంగతి తెల్సి వెళ్ళాను నేను. కూపీ తీసి జరిగినదంతా బయటికి లాగాను. నేను విన్నది, కన్నది యధాతథంగా పత్రికలో ప్రకటిద్దామనుకున్నాను. ఎమ్మెల్లే - కంట్రాక్టరు - ఇంజనీరు - ముగ్గురూ ప్రజల ధనం ఎలా స్వాహా చేస్తున్నారో వివరిద్దామనుకున్నాను- కాని మీరొప్పుకోలేదు. కనీసం, పేర్లు లేకుండా జనరల్ రిపోర్టు యిస్తానని చెప్పినా మీరు అంగీకరించలేదు.... 'సుబ్బరాజుగారు మనకి కావల్సినవారు' అన్నారు. పైగా కంట్రాక్టరంటే కిట్టని వాళ్ళెవరో, ఆ పిల్లాడ్ని నీళ్ళగోతిలోకి తోసి చంపేసి ఆందోళన లేవదీయించారని రిపోర్టు వ్రాయమన్నారు.

తుమ్మలపాలెంలో నీళ్ళకి చాలా ఇబ్బందిగా వుంది. అగ్రవర్ణాల వారికి ఒక చెరువయినా వుంది. కాని హరిజనుల అవస్త యింతా అంతా కాదు. వాళ్ళు వూరికి దూరంగా ఉన్న బాడవ చెరువు నుంచి నీళ్ళు తెచ్చుకోవాలి. అక్కడే చాకళ్ళు బట్టలుతుకుతారు. గొడ్లని కడుగుతారు. ఆ నీళ్ళు ఎప్పుడూ మురిగ్గా పసరుపట్టి వుంటాయి. ఇదంతా పట్నం వెళ్ళి చదువుకు వచ్చిన వెంకయ్యనే హరిజన యువకుడు గుర్తించాడు. తమ పేటలో అంటు వ్యాధులు ప్రబలటానికి ముఖ్యంగా ఆ మురికినీళ్ళే కారణం అని అతను చెప్పే వరకూ ఆ జనానికి తెలియలేదు. వూళ్ళో అంతా సుఖంగా మంచినీళ్ళు తాగుతుంటే మనకీ కర్మమేటి? మనం కూడా మంచి నీళ్ళ చెరువులో నీళ్ళు తెచ్చుకుందాం - అని తనవాళ్ళతో వాదించాడు

వెంకయ్య. తరతరాలుగా పెద్ద కులస్తులకు లొంగివుండే పద్ధతి మార్చుకోవాలన్నాడు. 'రోజులు మారాయి. ఇప్పుడు అంతా సమానం. మన పుట్టుక తక్కువదని తప్పుడు ఆలోచనలు మనం చేస్తే మనల్ని ఎక్కువ చేసేవాడెవడూ ఉండడు. ముందు మనం మారాలి' - అంటూ వాదించాడు. పెద్దవాళ్ళతో మన కెందుకురా బాబూ - అని తనవాళ్ళు నిరుత్సాహ పరచినా వినకుండా.... బిందె పట్టుకుని మంచి నీళ్ళ చెరువుకి దారితీశాడు. అతని వెంట మరో పదిమంది కుర్రాళ్ళు బిందెలు పట్టుకుని బయల్దేరారు. ఊళ్ళో పెద్ద పెద్ద కులస్తులంతా మండిపడిపోయారు. మాలపల్లి మీద వెంకయ్యని పబ్లిగ్గా గుంజకి కట్టి నిర్దాక్షిణ్యంగా కర్రలతో బాదారు. వెంకయ్య అప్పటికప్పుడే ప్రాణాలు విడిచాడు. మాలకులస్తులంతా వెంకయ్య మరణానికి గోలుగోలున ఏడుస్తూ పోలీస్‌స్టేషన్‌కి పోయి కేసు రాసుకోమంటే ఆ ఇనస్పెక్టరు - "మాల లంజకొడుకుల్లారా! పెద్దోళ్ళతో మీకు పంతాలా?" అని బూతులు తిట్టి కేసు రాసుకున్నాడు.

మా మీద కేసు పెడతారా? అని పెద్ద కులస్తులు హరిజనవాడని తగలబెట్టించారు. చేతికి అందిన సరుకులన్నీ చెల్లా చెదురు చేశారు. హరిజన స్త్రీలని అవమానాలు చేశారు. అన్నీ పోలీసుల ముందే జరిగాయి. అంతఘోరం జరిగినా ఆ వార్తలు రావలసిన రీతిగా పేపర్లలో రానేలేదు. నేను చాలా పట్టుదలతో ఆ ప్రదేశానికి వెళ్ళాను. నానా తంటాలుపడి సమాచారం సేకరించాను. జరిగింది జరిగినట్టు రిపోర్టు రాసినకీర్తి నాకే దక్కాలనుకున్నాను. నేనదంతా తయారుచేసి మీ చేతుల్లో పెడితే మీరు పెదవి విరిచి "పెద్ద కులస్తుల్ని పేపర్లకెక్కించడం మనకు మర్యాదు కాద"న్నారు. ఈ కొట్లాటలో హరిజనులదే తప్పన్నారు. తరతరాల నుంచీ వాళ్ళు బాడవచెరువు నీళ్ళు తాగటంలేదా? ఇవ్వాళ బ్రాహ్మణ చెరువు నీళ్ళు కావలసి వచ్చాయా? అన్యాయంగా పెద్దకులస్తుల్ని హరిజనులే కలహానికి రెచ్చగొట్టారన్నారు. అనడంతో సరిపెడితే సరే. ఆ ముక్కలన్నీ నన్ను వ్రాయమన్నారు. నేను కిక్కురుమనకుండా విన్నాను. ఎంత దుర్మార్గుడినో నేను ఈ చేతులతో అంత మహాపాపం చేశాను. హరిజన యువకులు పెద్దకులస్తుల పంటలను దొంగతనం చేశారనీ, అందుకే కొట్లాడ ప్రారంభమైందనీ, హరి జనులు వాళ్ళలో వాళ్ళు తగాదాలుపడి ఇళ్ళు తగులబెట్టుకున్నారనీ ఏమేమో వచ్చి అబద్ధాలు వ్రాసేశాను. ఆనాడు కూడా నా మనసు మూలిగింది. కానీ దాని పీక నొక్కేశాను నేను. అంతకు పూర్వమే నా పీక నొక్కేశారు మీరు.

ఇంకో సంగతి వినండి. గుర్తు చేస్తాను..... మంత్రిగారి భద్రాచలం టూర్ వార్తలు ఇవ్వటానికి వెళ్ళినప్పుడు ఒక పల్లెటూళ్ళో భూస్వామి ఒకాయన వూరూరా తిరుగుతూ వచ్చిన గంగిరెద్దువాళ్ళనుంచి రెండెద్దుల్ని బలవంతంగా లాక్కున్న విషయం నాకు తెల్సింది. ఆ యెద్దులు తనవేనని ఆర్నెల్లక్రితం ఎవరో దొంగిలించుకుపోయారని అంటాడు ఆ భూస్వామి. వాటిని దూడల్లాగా ఉన్నప్పట్నించి పెంచి పెద్దచేసి ఆటాడించి పొట్టపోసుకుంటున్నాము బాబో - అంటారు గంగిరెద్దులవాళ్ళు. పొరుగూరి పెద్ద మనుషులెవరో ఆ భూస్వామితో

పనివుండి వచ్చినప్పుడు గంగిరెద్దుల వాళ్ళ తగవు వినటం జరిగింది. 'మీ వూరి పెద్దమనిషి నెవర్నయినా తీసుకు వచ్చి సాక్ష్యం చెప్పించండి. ఈ ఎద్దులు మీవేనని అంటే దొరగారలాగే యిచ్చేస్తారు' - అన్నారు మధ్యవర్తులు.

గంగిరెద్దుల వాళ్ళు చాలా గోల పెట్టారు. మనుషులు అబద్ధాలాడినా జంతువులు అబద్ధాలాడవని ఛాలెంజ్ చేసారు. ఎద్దుల కళ్ళకి గంతలు కట్టమని ..... పాతిక గజాల దూరంలో తాము నుంచొని వాటిని పిలుస్తామని, అవి తమ దగ్గరికి రాకపోతే వాటిని దొరగారికే వదిలిపెట్టి పోతామనీ అన్నారు వాళ్ళు. అయితే ఆ భూస్వామిగారు ఆ సవ్వాళ్ళకేమీ చెక్కు చెదరలేదు. అయితే ఆ భూస్వామి గంగిరెడ్లవాళ్ళమీద పోలీసులకి రిపోర్టు ఇస్తానన్నాడు. గంగిరెడ్ల వాళ్ళు ఏడుస్తూ పోయారు. ఇదంతా కళ్ళతో చూసిన వాళ్ళెవరో మంత్రిగారి మీటింగ్ దగ్గర చెప్పుకుంటుంటే నేను విన్నాను. అంతవరకు మంత్రిగారి టూర్‌లో నాకేమీ మేటరు దొరకలేదన్న బాధపోయి ట్రిప్ వేస్ట్‌కాలేదన్న ఉత్సాహంతో ఆ వూరు వెళ్ళి పూర్తి వివరాలు సేకరించాను... కానీ ఏం లాభం?

మంత్రిగారికి జరిగిన ఘనసన్మానం, వారు కుడిచిన విందులు, వారి సభలకి జరిగిన అమోఘమైన ఏర్పాట్లు.... వీటి మీద రెండు కాలమ్సు తక్కువ కాకుండా రిపోర్టు వ్రాయ మన్నారేకాని.... గంగిరెద్దులవాళ్ళకి జరిగిన అన్యాయం గురించి చెప్తే, దానిమీద రెండు ముక్కలు రాస్తానంటే మీరు నవ్వేసి అక్కర్లేదన్నారు.

ఇలాంటి సంఘటనలు.... మూడూ, నాల్గూ కాదు. వందలూ, వేలూ జరిగాయి. వ్యక్తిగతమైన అన్యాయాల గురించి పత్రికల్లో ప్రాధాన్యత యివ్వటం అనవసరమని అంటూనే.... అవే సంఘటనల్ని మార్చి మరీ వ్రాయమని చెప్పారు మీరు. వాస్తవంగా ఎవరు బాధలకు గురి అయ్యారో చివరికి వాళ్ళనే నేరస్తులుగా చిత్రించే గతి పట్టింది, నా రిపోర్టులకు!

ఒకసారి హిందూ వ్యాపారస్తులకీ, ముస్లిం వ్యాపారస్తులకీ మధ్య పోటీ వచ్చింది. మీకు బాగా జ్ఞాపకముండే ఉంటుంది. లోపాయికారీ విషయం వూళ్ళోని బిజినెస్ కంట్రోలు చేజిక్కించుకోవటంలో వచ్చిన పోటీ అది. మొత్తం మీద ముస్లిం వ్యాపారుల బిజినెస్ బలహీనంగా వుంది. ఆ పరిస్థితుల్లో ఏదో విధంగా హిందూ వ్యాపారుల్ని దెబ్బతీయటం ఒక్కటే మార్గం కనిపించింది.

అప్పటికే తమతో పోటీ పడుతున్న ముస్లి వ్యాపారస్తుల్ని చూసి హిందూ వ్యాపారస్తులు భయపడ్డారు. వాళ్ళను ఆదిలోనే అణగద్రొక్కాలని పథకాలు వేశారు. ఒకళ్ళ మీద ఇంకొకళ్ళు తిరగబడడానికి అదనుకోసం వేచి చూస్తున్నారు. ఎక్కడో కిళ్ళీకొట్టు దగ్గర ఇద్దరికి చిన్న కొట్లాట జరిగింది. అందులో ఒకడు హిందువు. మరొకడు ముస్లిం. అంతే. అంతా వారి వారి పక్షాలకు చేరుకున్నారు. తలలు బ్రద్దలయ్యాయి. షాపులు లూటీ అయ్యాయి. ఇళ్ళు తగలబడ్డాయి. ఇరువైపులవాళ్ళూ చెప్పుకోలేనన్ని అత్యాచారాలకి పాల్పడ్డారు....

అధిక ధరలతో, కల్తీ సరుకులతో, దొంగ రవాణాతో - సామాన్య ప్రజల్ని నిత్యం

పీక్కుతింటున్న ఘోరం చాలాదన్నట్టు ఆందోళనతో అందరికీ ప్రాణభయం తెచ్చిపెట్టారు వ్యాపారస్తులు. పథకాలు వేసిన వీళ్ళు బాగానే వున్నారు. డబ్బులు పుచ్చుకుని ఘోరాలు చేసిన గూండాగాళ్ళు చక్కగానే తప్పించుకున్నారు. ఇక ఎటూ కాకుండాపోయింది ఏ పాపమూ ఎరుగని ప్రజలు.... వీళ్ళల్లో హిందువులున్నారు, ముస్లిములున్నారు, క్రిస్టియన్లున్నారు. అన్ని మతాలవాళ్ళూ, అన్ని తెగలవాళ్ళూ ఉన్నారు. అన్యాయానికి ఆహుతి అవటానికి మాత్రం కులాలు అడ్డురాలేదు. వాళ్ళ బాధల్ని మతాలు తగ్గించనూ లేదు.... వ్యాపారస్తుల వృత్తిపరమైన పోటీవల్ల ఇంత ఘోరం జరిగిందని నేనెంతో పరిశోధన చేసి రిపోర్టు వ్రాస్తే మీ రొక్క ముక్కలో 'నో' అన్నారు. 'సెఫీ' గారికి మీ బిజినెస్‌లో వాటా వుండటం, రంగారావూ - వెంకట్రాయుడుగార్లు మీకు స్నేహితులవటం..... ఇంతకన్న వేరే కారణాలేమీ నాకు కన్పించ లేదు. హిందూ - ముస్లింల మధ్య మతపరంగా ఏవో గొడవలు జరిగాయని వ్రాయమని శెలవిచ్చారు.

షణ్ముగం ఇండస్ట్రీస్ మేనేజిమెంట్ యూనియన్ నాయకుల మీద దొంగ కేసులేవో పెట్టి డిస్మిస్ చేసింది. దాంతో కార్మికులంతా సమ్మెచేసారు. శాంతియుతంగా వాళ్ళు చేస్తున్న సమ్మెని సామదాన భేదోపాయాలతో భగ్నం చేయలేక చివరికి దండోపాయం ప్రయోగించింది మేనేజిమెంటు. రౌడీ మూకల్ని సమ్మె స్థలానికి పంపింది. దాంతో కార్మికులు తీవ్రంగా ప్రతి ఘటించారు. ఆపైన పోలీసులు వచ్చి అన్యాయంగా కాల్పులు జరిపారు. నలభైమందికి గాయాలు తగిలాయి. పదిమందిదాకా ప్రాణాలు కోల్పోయారు. మేనేజ్‌మెంట్, పోలీసులు లాలూచీపడి చేసిన ఘోరాలు, బయటపెట్టి కార్మికులకి న్యాయం చేద్దామని నేను రిపోర్టు వ్రాస్తే దాన్ని నా ముఖం మీదే చింపివేసారు మీరు.... మనం ప్రజల మధ్య శాంతి నెలకొల్ప వల్సిన వాళ్ళమే కాని ఇలాంటి రిపోర్టులు ప్రకటించి రెచ్చకొట్టకూడదు' అని ఉపన్యాసం ఇచ్చారు. అంతటితో సరిపెట్టి అసలు రిపోర్టు వద్దంటే మీ ఆర్గ్యుమెంటులో పాయింట్ కన్పించేది. కాని, ..... 'ఫ్యాక్టరీ తగలబెట్టబోతున్న అల్లరి మూకని చెదరగొట్టటానికి పోలీసులు కాల్పులు జరపక తప్పలేదని, పదిమందికి గాయాలు తగిలాయనీ, ఇద్దరి పరిస్థితి ప్రమాదంగా వున్నట్టు తెలుస్తోందనీ...' మీనోటికొచ్చింది చెప్పి రాయమన్నారు.

నిన్నగాక మొన్న శంకర్‌గిరిలో బ్రహ్మాండమైన గిరిజన మీటింగు జరిగితే దాన్ని గురించి నాల్గుముక్కలు రాయలేని నేను, దాని పక్క వూళ్ళో పట్టుమని పదిమంది చేరని కలెక్టరు మీటింగ్‌ని ఆకాశానికెత్తుతూ ఫుల్‌పేజీ వ్రాశాను.

అయ్యా! ఇలాంటి ఘోరాలు ఒకటా? రెండా? పదా? పదిహేనా? ఎన్నని చెప్పను? అయితే నేను ఇన్నేళ్ళలో ఏమీ నిజాలు వ్రాయనేలేదా? అంటారా? వ్రాశాను. ఫలానా సినిమా 12 సెంటర్లలో శతదినోత్సవాలు చేసుకుందనీ, ఫలానా మార్గంలో కొత్త రైలుబండిని ప్రవేశ పెట్టారనీ, ఫలానా మంత్రిగారి మేనకోడలు వివాహం వైభవోపేతంగా జరిగిందనీ.... నా రిపోర్టరు బ్రతుకంతా ఈ కాకమ్మ కథలకే అంకితమైపోయింది. మంత్రివర్యుల సభలకీ,

సమావేశాలకీ, శంకుస్థాపనలకీ, ప్రారంభోత్సవాలకీ నాగా లేకుండా హాజరవుతూ వచ్చాను. శ్రీవార్లని కీర్తిస్తూ వచ్చాను.

ప్రతి సమావేశంలోనూ మహామహుల ఉపన్యాసాలకు అదే తల, అదేతోక. సభల్లో వారి ప్రకటనలకి అదే శంఖం. అదే తీర్థం. ప్రారంభోత్సవాల్లో అవే రిబ్బనులు - అవే కత్తెరలు. శంఖుస్థాపనల్లో పాతిన రాళ్ళయినా కాలగతికి కరుగుతున్నాయేమో కాని... శ్రీవారి మాటలకి తరుగుదల లేదు. భవిష్యత్తుమీద ఆశలు, కల్పనలు, హామీలు, అభిలాషలు, అభిభాషణలు, అంతులేని కథలు, కబుర్లు, కాకరకాయలు పాడిందే పాడరా. ఈ దేశంలో ఏం వున్నా, ఏం లేకపోయినా "నాయకుల" మాటలకు మాత్రం కొదవలేదు. మాటలు! మాటలు! మాటలు! మాటలకే కడుపు నిండే వరాలెవరైనా ప్రసాదిస్తే భారతదేశం అంత సిరిసంపదలు గల దేశం మరెక్కడా వుండదు.

ఈ గ్రామఫోను ప్లేటు సంగీతాన్ని వారు గానం చేస్తూనే ఉన్నారు. నేను నిత్యపారాయణ చేస్తూ ప్రజలకి వినిపిస్తూనే వున్నాను. ఆనాటి నానల్ల జుట్టు రాలి రాలి ఉన్న జుట్టు తెల్ల బడటమూ జరిగింది. మీరొకసారి బహుకరించిన పార్కరు పెన్నుపాళీ అలసి సొలసి అరగనూ అరిగింది. నా చూపు తగ్గి కంటి కాంతి తగ్గి చత్వారమూ వచ్చింది.

ఒంటినిండా విటమినులు, ఇంటినిండా సంపదలు, తనయుల జీవితాలన్నీ వడ్డించిన విస్తళ్ళు.... అలనాటి మహారాజుల వైభవాన్ని గుర్తుచేసేలా వాకిళ్ళలో కూతుళ్ళ పెళ్ళిళ్ళు.... శ్రీవారి జీవితాల్లో ఆనంద సందోహాలనిచ్చే మార్పులు మరెన్నో సంభవించాయి.

నాయకుల సరిక్రొత్త మాటలు నేర్చినప్పుడల్లా నేనూ క్రొత్త క్రొత్త విషయాలు పుట్టించి గుప్పిస్తూనే వచ్చాను. గరీబా హఠావ్‌లు, సోషలిజాలు, రాజభరణాల రద్దులు, భూమి సంస్కరణలు, బ్యాంకుల జాతీయాలు, సంపూర్ణ విప్లవాలు, ప్రజాస్వామ్య పునరుద్ధరణలు.... వారొక్కక్క బాణం వేయడం, నేనో సంచలనం కలిగించటం... మాకందరికీ ఇదొక ఆట అయిపోయింది.

ఒకప్పుడు కేవలం జనరల్ నాలెడ్జ్‌కోసం, విలేఖరిగా నావృత్తికెంతో ఉపయోగ పడుతుందని అనేక పుస్తకాలు చదివాను. పశుపక్ష్యాదులకి సంబంధించిన శాస్త్రాలు చదివాను. భౌతిక, రసాయనిక, ఖనిజ, ఖగోళ, భూగర్భ శాస్త్రాలు వల్లించాను. గణితం, జ్యోతిష్యం, హస్త సాముద్రికం, తర్కం (కుతర్కం) వేదాంతం - ఇత్యాది శాస్త్రాలలో కూడా వేళ్ళు పెట్టాను. ఇతిహాస, కావ్య ప్రబంధాలగురించీ, సంగీత నృత్య నాటక చిత్రలేఖ శిల్పకళల గురించీ ఏదో కాస్త పరిశీలన చేశాను. చారిత్రక, ఆర్థిక, సామాజిక సమస్యలపై వున్న గ్రంథాలేవో కళ్ళజూశాను.

కాని, నా జ్ఞానం ఎందుకు పనికి వచ్చింది? నాయకుల 'సొల్లు' కబుర్లకి రంగులు అద్దడానికి మాత్రమే పనికి వచ్చింది. శ్రీవార్ల నోటితుంపరలకెన్నో అర్థాల్ని ఆపాదిస్తూ ఎన్నెన్ని ప్రక్రియలకి పాల్పడాలో అన్ని విన్యాసాలు చేశాను. నాయకుల తరగని మాటల పాతరలలో

కొత్త తేగలు త్రవ్వి తలకెత్తుకో లేనప్పుడు - వాక్ చమత్కృతి మీదపడి బ్రతుకుతూ వచ్చాను. వరదలు వచ్చినప్పుడు .... కరువులు వచ్చినప్పుడు వాటి గురించి ఉన్నదున్నట్లు వ్రాసి ప్రజల్ని భయపెట్టడం తప్పని శ్రీవారన్నారు. మీరూ అన్నారు. నన్నునుకోమన్నారు. అనుకున్నాను. అలాగే రాశాను. ఆ ప్రాంతాలన్నీ ఇపుడు ఎంత సుందరమయి పోయినవో, ఎంత సస్యశ్యామలంగా మారినవో వర్ణించాను. ప్రజలు నన్ను తన్నవస్తే ప్రాణాలరచేత పెట్టుకుని కాలికి బుద్ధి చెప్పవలసిన గతి పట్టింది నాకు. సిగ్గుతో చచ్చిపోయాను.

మన ఆట ఇలా అనంతంగా ఇంతకాలం సాగుతూ వచ్చింది. ఈలోగా జైళ్ళు పూర్తిగా నిండాయి. ఫైళ్ళు గుట్టలు గుట్టలుగా లేచాయి. హత్యలు, మానభంగాలు, దొంగతనాలు, దోపిడీలు, కలహాలు, కుమ్ములాటలు కోకొల్లలుగా రికార్డులు బ్రేక్ చేస్తున్నాయి. ధరలు పెరుగుతున్నాయి. తిండికి, బట్టకి, చదువుకి, పదవికి, బతుక్కేకాదు, చావుకి కూడా ధరలు పెరుగుతున్నాయి.

ఎక్కడ చూసినా సమ్మెలు - లాకౌట్లు - ఘెరావ్‌లు - నిరాహార దీక్షలు - ఆత్మ హత్యలు - ఆకలి చావులు. దినందినం ప్రజల కడగండ్లు పెరిగిపోతున్నాయి.

ఎక్కడెక్కడి వార్తలూ ప్రజలకు తెల్పే విలేఖరి వృత్తి చేపట్టిన నేను వ్రాయవలసినవి వ్రాయక, వ్రాయగూడనివి వ్రాశాను. ఎందుకు? ఎందుకు ఇంత నీచానికి పాల్పడ్డాను.

నా ఆత్మని నేను తేలిగ్గానే జోకొట్టుకోగలిగాను గనుక.

కానీ అది ఇక నాకు చేతకాని పని. నేనిక చెయ్యలేని పని. నా కళ్ళు పూర్తిగా విచ్చుకున్నాయి. నా కళ్ళ ఎదుట ఏం జరుగుతుందో చూస్తున్నాను. దేశంలో ఏం జరుగుతుందో నాకు తోచినట్టు నేను అర్థం చేసుకుంటున్నాను.

ఒకపక్క భోగభాగ్యాలు. వేరొకపక్క ఆకలి డొక్కలు.

ఒకపక్క నల్లబజారులు. వేరొకపక్క కరువు కాటకాలు.

ఇంకా నేనా అమాయకుల్ని మోసగించనా?

ఇంకా నేనీ ద్రోహపువృత్తే చెయ్యనా?

జర్నలిజం మీద డాక్టరేట్లు, తప్పిజారి తామ్రపత్రాలు, పట్టంకట్టే బహుమానాలు, ఆ పైన అభినందన సభలు, పూలదండలు, మీరిచ్చే పెద్ద పెద్ద ఇంక్రిమెంటులు... ఇక అవి నన్ను మభ్యపెట్టలేవు.

నేనిప్పుడు మీ విలేఖరిని కాదు. ఇంతకాలం చేసిన నా పాపాలు కడుక్కునే తొలి ప్రయత్నమే నా ఈ రాజీనామా. నేనిప్పుడు ప్రజల మనిషి ననుకుంటే నా శరీరం ఆనందంతో పులకరిస్తోంది. ఇలాంటి ఆనందం ఇంతకుముందెన్నడూ అనుభవించలేదు.

ఇంతకాలం ప్రజాద్రోహిగా బ్రతికిన ఒక అల్పజీవి -

పరశురామ్.

●